క్లుప్తంగా

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



కల్వకుర్తి రూరల్: మండలంలోని తురకలపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు బుధవారం కల్వకుర్తి డిపోలో వినతి పత్రం అందజేశారు. మూడు సంవత్సరాలుగా బస్సు గ్రామానికి రాకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రెండు కిలోమీటర్ల దూరం నడిచి బస్సు ఎక్కాల్సి వస్తుందని వాపోయారు. ఇబ్బందులను గుర్తించి బస్సు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని డిపో అధికారులు హామీ ఇచ్చారు. గ్రామస్తులు శివప్రసాద్, విజేందర్ రెడ్డి, భీమయ్య, ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని పాతబస్తీకి చెందిన తాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.5 వేలను బుధవారం బాధ్యత కుటుంబానికి అందేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భావండ్ల మధు డబ్బులు అందించారు. కార్యక్రమంలో గణేష్, టిప్పు సుల్తాన్, శేఖర్ గౌడ్, మక్బూల్, శేఖర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, బ్యాగుల వితరణ



కందనూలు: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థి దూరెడ్డి లక్ష్మారెడ్డి తండ్రి జంగిరెడ్డి జ్ఞాపకార్థం రూ.40 వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ దాతలు సహకారం మరిచిపోలేమన్నారు. హెచ్‌ఎం మంజుల, మాజీ కౌన్సిలర్ దూరెడ్డి అచ్యుతారెడ్డి, తిరుపతిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



కొల్లాపూర్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే నాయకులు పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టా రు. జర్నలిస్టులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. ఎనిమిదో రోజు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. మంత్రి జూపల్లి కృష్ణారావు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీపై స్పందించాలని వారు కోరా రు. న్యాయం చేసే వరకు పోరాడుతామన్నా రు. రాష్ట్ర నాయకులు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రాంచందర్, నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి నాయకులు కురుమయ్య, సీపీ నాయుడు, కేశవులు, రమణ, కారంగి గోవిందు ఉన్నారు.

నేడు బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం బూత్‌స్థాయి అధికారుల జాతీయ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాజిపేట మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, నాగర్‌కర్నూల్‌లోని పోలింగ్ కేంద్రం 103 నుంచి 111, 120 నుంచి 169 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బూత్‌స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్: కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచ గ్రామ సమీపంలో ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఏఎస్‌ఐ వివరాల ప్రకారం విధి నిర్వాహణలో భాగంగా కానిస్టేబుల్ శరత్‌గౌడ్ బుధవారం సాయంత్రం ఆవంచ గ్రామానికి వెళ్లాడు. గ్రామ సమీపంలోని దుందుబీ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వేతనాలు అందక అవస్థలు

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు



కంటోనిపల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు



వెల్దండ మండల కేంద్రంలో డ్రైనేజీ శుభ్రం చేస్తున్న కార్మికులు

వెల్దండ: గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేక పాలనలో కార్మికులకు వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా నిత్యం పని చేసే కార్మికులకు జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పంచాయతీల ఖాతాలు ఖాళీగా ఉండడంతో కనీసం వీధిలైట్లు, బోరుమోటర్ల మరమ్మతులు, ట్రాక్టర్‌కు డీజిల్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో మొత్తం 106 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.9,500 వేతనాలు చెల్లిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్మికులకు మూడు నెలలకుగాను రూ.30.20 లక్షలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా..

మండలంలోని కార్మికులకు ప్రతి నెల వేతనాలను చెల్లించేందుకు కనీసం రూ.10.7 లక్షలు, ట్రాక్టర్ డీజిల్, వీధిలైట్ల కోసం మరో రూ.10 లక్షలు అవసరం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మూడు నెలలుగా ఎలాంటి నిధులు మంజూరు కావడం లేదు. దీంతో ప్రతి పంచాయతీలల్లో కార్మికులకు 3 నెలలుకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీలల్లో ఇంటి పన్నులు, ఇతర ట్యాక్సీలు వసూలు చేసి రెండు నెలల వరకు వేతనాలను అందించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నిధులు మంజూరు లేక..

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యేవి. దీంతో 2022 ఆగస్టు నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు మంజూరు కావడంలేదు. గ్రామ జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు మంజూరు కావడం లేదు. దీంతో కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు భారంగా మారింది.

జీతాలు అందలేదు



గ్రామ పంచాయతీలో పనులు చేస్తున్న మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ప్రతి రోజు వీధులు శుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో చెత్తచెదారం తొలగిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతేనే జీతాలు ఇస్తామన్నారు. కాని ఇప్పటివరకు జీతాలు చెల్లించలేదు. కుటుంబ పోషణ భారంగా మారింది.

–యాదయ్య, పంచాయతీ కార్మికుడు, వెల్దండ

ఇబ్బందులు లేకుండా చూస్తాం



గ్రామ పంచాయతీ కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. గ్రామ పంచాయతీలో ఉన్న నిధులతో వేతనాలు అందిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో ఇంటిపన్నులు వసూలు చేసి కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నాం. అదే విధంగా నిధుల మంజూరుకు జిల్లా అధికారులకు నివేదికలను అందించాం.

–లక్ష్మణ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, వెల్దండ

ఎంపీఓగా నారాయణ

చారకొండ: మండల పంచాయతీ అధికారిగా ఎం. నారాయణ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చారకొండలో ఎంపీఓగా పనిచేస్తున్న వెంకటేష్ బదిలీపై ఉప్పునుంతలకు వెళ్లడంతో అక్కడ పని చేస్తున్న ఎంపీఓ నారాయణ బదిలీపై చారకొండ వచ్చి విధుల్లో చేరారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్లలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామ రైతు శివకు చెందిన పాడి ఆవు రెడ్యా తండా సమీపంలోని వ్యవసాయ పొలంలో మేత మేస్తున్న సందర్భంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని రామకృష్ణ థియేటర్ ఎదుట బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలకపల్లి మండలం కార్వంగా గ్రామానికి చెందిన కుర్మయ్య ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఎదురుగా మైనర్లు ద్విచక్రవాహనం నడుపుతూ కుర్మయ్య వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన కుర్మయ్యను 108 వాహనంలో జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్ ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత



నాగర్‌కర్నూల్ రూరల్: ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ సలాంకు కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు సమ్మె నోటీస్ అందజేశారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుమయ్య, వెంకటయ్య, మల్లేష్, రామస్వామి, శ్రీను, చెన్నయ్య, మల్లయ్య, సత్యం లక్ష్మి శివమ్మ ఎల్లమ్మ, కళావతి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించి మండలంలోని పంచాయతీ కార్మికులు, సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు కమ్మలపల్లి మధు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు మండలంలోని కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బాలస్వామి, జీపీ కార్మికులు మల్లయ్య, పురాన్, లక్ష్మయ్య, లాలయ్య, రాములు, లింగయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణపై అవగాహన



వెల్దండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీదేవి

తిమ్మాజిపేట/చారకొండ/వెల్దండ/బల్మూరు: ఆయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిమ్మాజిపేటలో ఎంపీడీఓ లక్ష్మీదేవి, చారకొండ ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, వెల్దండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్, బల్మూరు ఎంపీడీఓ రాఘవులు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతల్లో అమలవుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025పై కేంద్ర బృందాలు తనిఖీ నిర్వహించనునట్లు తెలిపారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై సర్వే చేసి అవార్డులకు ఎంపిక చేస్తారని వివరించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తిమ్మాజిపేటలో తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంఈఓ సత్యనారాయణశెట్టి, ఏఓ కమల్‌కుమార్, ఏపీఓ సత్యనారాయణ, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, పలు శాఖల అధికారులు, చారకొండలో ఎంపీఓ నారాయణ, ఏఈ దివ్య, వెల్దండ ఇన్‌చార్జ్ ఎంపీఓ మురాహరి, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్, బల్మూరులో సీడీపీఓ దమయంతి, ఎంఈఓ విష్ణుమూర్తి, ఏపీఓ సువర్ణ, ఎంపీఓ నర్సిరెడ్డి, ఏఈ మధుబాబు, వార్డెన్ మల్లయ్య, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించాలి



కోడేరు: మండలంలోని తీగలపల్లి శివారులో చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా దాదాపు ఎనిమిదేళ్ల కిందట కట్ట వెనకభాగంలో నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కట్టపై కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో కట్ట ప్రమాదకరంగా మారింది. కట్ట నెర్రెలుబారే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాంట్రాక్టర్లు, ఇంజనీయర్ అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గేట్‌వాల్వ్ లీకేజీని అరికట్టాలి



కోడేరు: మండల కేంద్రంలోని ఊరగుట్ట సమీపంలో పశువైద్య కేంద్రం వద్ద మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ లీకేజీ కావడంతో బురదమయంగా మారి తాగునీరు కలుషితంగా మారుతోంది. మురుగు చేరడంతో పైపుల ద్వారా కలుషిత నీరు వచ్చి విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందనిని స్థానికులు వాపోతున్నారు. దాదాపు 20 రోజులు కావొస్తున్నా లీకేజీ అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలు అరికట్టాలని కోరుతున్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్తాం



మన్ననూర్: బీసీలను మోసం చేస్తున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని బీసీ నాయకులు చరణ్ విశ్వకర్మ, చంద్రమౌళి విశ్వకర్మ హెచ్చరించారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకే మరోసారి మోసం చేసిందన్నారు. అగ్రకులస్తుడికే అధ్యక్ష పదవి కట్టబెట్టడం సరికాదన్నారు. అదే విధంగా బీజేపీ రెండు నాల్కల ధోరని అవలింభిస్తూ 2018లో కుల గణన చేస్తామని, 2022లో కుల గణన ప్రసక్తే లేదని ప్రస్తుతం 2025లో కుల గణన చేస్తామని తిరిగి ప్రకటనలు చేస్తూ బీసీలపై సవతి తల్లి ప్రేమ ఒలకబోస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపిస్తే ఇప్పటికి అతిలేదు గతిలేదని వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన ఘటన మండలంలోని గౌరరంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గౌరారం గ్రామ సమీపంలోని గోదాం వద్ద గుర్తుతెలియని వ్యక్తి బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు బాధితుడిని 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. క్షతగాత్రుడు మాట్లాడలేని స్థితితో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపాడు.

8 నుంచి బీఎల్‌ఓలకు శిక్షణ

కల్వకుర్తి రూరల్: దేశ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆర్డీఓ, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీను మాట్లాడుతూ ఎన్నికల పకడ్బందీ నిర్వహణకు కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ముందుకు సాగుతామన్నారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనల మేరకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఇబ్రహీం, కార్తీక్, సునీత, లలిత, ముంతాజ్, వినయ్ కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఎన్నికల డీటీలు రాఘవేందర్, అనిత, కిరణ్ కుమార్, రాజశేఖర్ రెడ్డితోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బిజినేపల్లి మండలం పాలెంలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుచుకూళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలెంలో నూతనంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల ఇళ్లు నిర్మించడంలో విఫలం అయ్యిందన్నారు. పేదలందరికీ ఇళ్లు నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగోలు ఉదయ్‌రెడ్డి, తిరుపతయ్య, అమృత్‌రెడ్డి, శంకర్, ముద్ద మధుసూదన్‌రెడ్డి, మిద్దెరాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

బల్మూర్: మండలంలోని అంబగిరిలో ఇందరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాశన్న యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సంపంగి రమేష్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు చందు నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బీల్‌నాయక్, చందు, మల్లయ్య, భాస్కర్, కృష్ణ, శంకర్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అర్హుల ఎంపిక

చారకొండ: పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో చేసినట్లు మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్ అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి, జూపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శి, నాయకులు బాల్‌రాం గౌడ్, జైపాల్, ప్రభాకర్ రావు, శ్రీపతి రావు, నాగార్జున, యాదయ్య తదితరులు ఉన్నారు.

ఎడతెరపిలేని ముసురు



పెద్దకొత్తపల్లి/ఉప్పునుంతల: ఆయా మండల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా ముసురు పట్టింది. పత్తి, మొక్కజొన్న పంటలకు చీడ పీడల నివారణ కోసం మందులు చల్లుతున్నారు. అదేవిధంగా వరి నాట్ల కోసం వరి తుకాలు పోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న తేలిక పాటి వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టీకాలు సకాలంలో ఇవ్వాలి



బిజినేపల్లి: గ్రామాల్లోని గర్భిణులకు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలని జిల్లా టీకాల అధికారి డా.రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాలెం పీహెచ్‌సీని ఆయన సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలక అవగాహన కలిగ్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. ప్రియాంక, సిబ్బంది బాదం రాజేశ్వర్, గోవర్ధన్, గజవర్ధనమ్మ, మల్లిక, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



కోడేరు: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాజేష్, ప్రశాంత్, మల్లేష్, మహేష్, రాము, మధు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ప్రయోజనం

వీపనగండ్ల: సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక సహాయం అందించడంతో నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనమని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అన్నారు. బుధవారం కల్వరాల గ్రామంలో కొత్తకోట కళ్యాణికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.20,500 చెక్కును అందజేశారు. నియోజకవర్గంలో వందలాది మందికి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఈ సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, తిరుపతయ్య, మల్లేష్, శివుడు, రాముడు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలి



చిన్నంబావి: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలని నియోజకవర్గ నాయకులు ధారాసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి నిదర్శనం రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావు నియమించడమే అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను ఓర్వలేని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని, వాటిని కార్యకర్తలు సోషల్‌మీడియా వేదికగా తిప్పికొట్టాలన్నారు. మండలంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గోపినాయుడు, సాయిప్రణీత్ గౌడు, హరికాంత్, పురేందర్‌గౌడు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీలో పరిశుభ్రతను పాటించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భానుప్రకాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ ప్రాథమిక పాఠశాల, బీసీ, ఎస్సీ కాలనీలోని పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పరంగా అందుతున్న పాఠ్య పుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయిలత, కల్పన, సుశ్మీత, రవి, రంజిత్, సీఆర్‌పీ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు డబ్బులు జమ



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న ఖాతాదారులు, అమరేందర్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: తాము కష్టించి సంపాదించి బ్యాంకులో దాచుకున్న డబ్బులు మాయం కావడంతో రైతులు, ఖాతాదారులు ఆందోళన చెందారు. రెండేళ్లపాటు బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో మా డబ్బులు ఇకరావని ఆందోళన చెందుతున్న క్రమంలో ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత రైతులు, ఖాతాదారుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. మంగళ, బుధవారాల్లో ఖాతాల్లో మాయమైన డబ్బులను బ్యాంకు మేనేజరు బాధితులకు దగ్గరుండి డబ్బులు ఇప్పిస్తున్నాడు.

అసలేం జరిగింది..

అచ్చంపేట ఎస్‌బీఐ బ్యాంకులో కొన్నేళ్లుగా రైతులు, పేదలు, వ్యాపారులు, ఇతరులు డబ్బు దాచుకుంటున్నారు. కాగా అమాయక రైతులు, పేద ప్రజల ఖాతాల్లోని డబ్బులు ఖాళీ అవుతున్నాయి. 2023 సెప్టెంబర్, అక్టోబర్ నెలలో కొంత మంది ఖాతాదారులకు డబ్బులు అవసరం పడటంతో బ్యాంకు వద్దకు వచ్చి డబ్బుల ఆరా తీయగా...ఖాతాల్లో డబ్బులు లేవని గ్రహించి ఆందోళన చేశారు. గ్రహించిన బ్యాంకులోని క్లర్క్ కిరణ్(సూత్రధారి) క్షణాల్లో ఇతర ఖాతాల నుంచి ఆందోళన చేసిన ఖాతాదారులకు డబ్బులు మళ్లించాడు. ఈ తతంగాన్ని గ్రహించిన ప్రస్తుత బ్యాంకు మేనేజర్ హుస్సేన్‌బాషా పూర్తి స్థాయిలో విచారణ చేయగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. 2018 నుంచి క్లర్క్ కిరణ్ ఒకరి బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు మరొకరి ఖాతాల్లోకి మళ్లించి 21 మంది ఖాతాదారుల నుంచి రూ. 95 లక్షల వరకు డబ్బులు మాయం చేసినట్లు నిర్ధారించారు. అలాగే మరికొంత మంది ఖాతాదారుల నుంచి డబ్బులు మాయం చేశాడు. చాలా ఏళ్ల నుంచి బ్యాంకులో పాతుకపోయిన క్లర్క్ కిరణ్ ఖాతాల్లోని డబ్బులు ఖాళీ చేసినట్లు నిర్ధారణ కావడంతో అతన్ని విధుల నుంచి తొలగించడంతో పాటు సస్పెండ్ చేసి జైలుకు కూడా పంపారు.

అండగా నిలిచిన అమరేందర్‌రెడ్డి..

రైతులు, పేద ప్రజల ఖాతాల్లో డబ్బులు మాయమైన విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రవాసి విభాగం కన్వీనర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి వారికి మద్దతుగా నిలిచారు. రెండేళ్ల నుంచి బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడి స్థానిక బ్యాంకులో ఖాతాదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎట్టకేలకు బ్యాంకు అధికారులు దిగొచ్చి ఖాతాల్లో డబ్బులు మాయమైన ఖాతాదారులకు డబ్బులు అందజేశారు. మంగళవారం, బుధవారం పలువురు ఖాతాదారులకు బ్యాంకు మేనేజరు దగ్గరుండి వడ్డీతో సహా డబ్బులు అందజేశారు. ఖాతాదారులు బ్యాంకు మేనేజర్ హుస్సేన్‌బాషా, అమరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.